బీచ్‌లో పర్యాటకుల సందడి

సాగరతీరం.. కోలాహలం

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ఉదయమే ప్రత్యేక ద్విచక్ర వాహనాలతో తరలివచ్చారు. సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై నిలబడి ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

అల్లూరి స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిపిఎం 26వ జిల్లా మహాసభ ఉత్తేజభరిత వాతావరణంలో ముగిసింది. మూడేళ్ల ఉద్యమం సాధించిన ప్రగతి, భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికపై ప్రతినిధులు విస్తృత చర్చలు జరిపి జిల్లాలో ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించింది. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని నిర్ణయించింది. రాబోయే రోజుల్లో అల్లూరి స్ఫూర్తితో సమరశీల పోరాటాలు సాగిస్తామని ప్రతినిధులు ప్రతినబూనారు. జిల్లా ప్రగతికి, సమగ్ర అభివృద్ధితోపాటు కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యవసాయ, రైతు, కౌలురైతు, స్కీమ్ వర్కర్లు, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం సమస్యలపై పరిష్కారానికి 20 అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ అంశాలపై పోరాటాలు సాగించేందుకు ఐక్య ఉద్యమాలకు మహాసభ నాంది పలికింది.

సిపిఎం 26వ జిల్లా మహాసభ ఆదివారంతో ముగిసింది. మహాసభ మొదటి రోజు శుక్రవారం భారీ ప్రజాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి ముగింపు, జిల్లా మహాసభ సందర్భంగా కొత్త బస్టాండ్ కేశవరావు హైస్కూల్ నుంచి పాత బస్టాండ్ వరకూ మహాప్రజా ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సిపిఎం శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్‌వర్కర్లు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజానీకం సైతం వేలాదిగా తరలొచ్చి విజయవంతం చేశారు. పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభ జయప్రదంగా సాగింది.

రెండో రోజు శనివారం ఆర్ఎస్ నగర్ (ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం)లో వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో ప్రతినిధుల సభ జరిగింది. సిపిఎం సీనియర్ నేత, చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతినిధుల సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా ప్రతినిధులు చర్చల్లో పాల్గొని ఆమోదించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు


మంతెన సీతారాం

ప్రతినబూనిన ప్రతినిధులు
ముగిసిన సిపిఎం 26వ జిల్లా మహాసభ
జిల్లా సమగ్రాభివృద్ధికి మహాసభ ప్రధాన డిమాండ్
14 తీర్మానాలకు ఆమోదం
నూతన జిల్లా కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్
25 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

సిపిఎం నూతన జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. సిపిఎం 26వ జిల్లా మహాసభలో ప్రతినిధులు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా బి.బలరాం, చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు, బురిడి వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా దూసి కళ్యాణి, ధనికొండ శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, ముచ్చర్ల త్రిమూర్తులు, కానేటి బాలరాజు, సూర్నీడు వెంకటేశ్వరరావు, ఎ.అజయకుమారి, పొగాకు పూర్ణ, కె.తవిటినాయుడు, కేతా పద్మజ, కె.క్రాంతిబాబు, కామన మునిస్వామి, ఎకెవిఆర్.భద్రం, శేషపు అక్షయ్య, ఇంజేటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ ప్రక్రియను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం పర్యవేక్షించారు. ఇప్పటివరకూ జిల్లా కమిటీ సభ్యులుగా ఉండి రిలీవైన కె.రాజా రామ్మోహన్‌రాయ్, జవ్వాది శ్రీనివాస్, బిజి.మూర్తి, బత్తుల జార్జి, ఎం.వెంకటరావుకు నూతన జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రానున్న కాలంలో జిల్లాలో ప్రజా సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానంగా కాలుష్యం సమస్య వేధిస్తోందని, తాగునీటి జలాలు కలుషితమై జనం రోగాల పాలవుతున్నారన్నారు. శుద్ధి చేసిన నీటిని ప్రభుత్వం అందించాలన్నారు. ప్రభుత్వ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

సిపిఎం జిల్లా రథసారధులు వీరే..

జెఎన్‌వి.గోపాలన్

బి.బలరాం

చింతకాయల బాబూరావు

కవురు పెద్దిరాజు

కేతా గోపాలన్

బి.వాసుదేవరావు

పివి.ప్రతాప్

కర్రి నాగేశ్వరరావు

మహాసభ ఆమోదించిన తీర్మానాలు..

1.జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలి.
2.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలి.
3.వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి. ఉపాధి హామీ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి.
4.అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
5.సామాజిక న్యాయం అమలు చేయాలి. దళితులు, దళితపేటల అభివృద్ధికి కృషి చేయాలి.
6.బాలికలు, మహిళలపై అత్యాచారాలను, దాడులను అరికట్టాలి. భద్రత కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
7.పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించాలి. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి.
8.నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణానికి మూడు సెంట్ల స్థలం, రూ.5 లక్షల సహాయం అందించాలి.
9.పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. కాలువల ఆధునికీకరణ పూర్తి చేయాలి. రైతాంగ సమస్యలు పరిష్కరించాలి.
10.నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి.
11.సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్దరించాలి.
12.యువతకు ఉపాధి కల్పించాలి. క్రీడా మైదానాలను ఏర్పాటు చేసే క్రీడలను ప్రోత్సహించాలి.
13.వడ్డిలంక స్లూయిస్, లక్ష్మీపాలెం లాకుల మరమ్మతులు చేపట్టాలి. ముంపు సమస్యను పరిష్కరించాలి.
14.వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి.

సిపిఎం నేతలకు చిరు సత్కారం

సిపిఎం సీనియర్ నేతలకు సత్కారం..

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఉద్యమాలకు పూర్తి సహకారం అందిస్తూ ఉద్యమాభివృద్ధికి వివిధ రూపాల్లో సేవలందిస్తున్న సిపిఎం సీనియర్ నేతలను 26వ జిల్లా మహాసభ ఘనంగా సత్కరించింది. మొగల్తూరుకు చెందిన ఆదూరి సాంబమూర్తి, ఆకివీడుకు చెందిన బొక్కా సత్యనారాయణ, గేదెల లావణ్య, మోగల్లుకు చెందిన పాలా వెంకట చలపతిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.ఉమా మహేశ్వరరావు, జిల్లా నేతలు సత్కరించారు. వీరి సేవలను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం గుర్తు చేశారు.

'మెడికల్స్'లో మాయాజాలం..!

- మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ముందుకు
- కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వని పరిస్థితి
- మందుల నాణ్యతపై అనేక అనుమానాలు
- డాక్టర్ చీటిలేకుండానే పెద్ద ఎత్తున విక్రయాలు
- నిత్యం రూ.కోట్లలో వ్యాపారం సాగే చోట పర్యవేక్షణ కరువు
- అధికారుల, ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు
- రెండు జిల్లాలో దాదాపు మూడు వేల మెడికల్ స్టోర్‌లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మనుషుల ప్రాణాలకు విలువలేకుండా పోయింది. ప్రజలకు అత్యంత ముఖ్యమైన మందులు (ఔషధాలు) విక్రయించే షాపులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అత్యధిక మందుల షాపులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మెడికల్ స్టోర్‌లు ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ రూ.కోట్లలో మందుల వ్యాపారం జరుగుతోంది. ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. జంక్‌ఫుడ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. తాగునీరు కలుషితంగా మారింది. దీంతో జనాలను రోగాలు పట్టిపీడిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతోపాటు, షుగర్, బిపి, కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు సైతం రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2024 నవంబర్ నుంచి రెండు జిల్లాల్లో ఆరోగ్యశాఖ చేస్తున్న స్క్రీనింగ్ పరీక్షల ఫలితాలను చూస్తే రోగాల తీవ్ర ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ప్రతి వంద మందిలో ఒకరు కేన్సర్ అనుమానితులుగా తేలుతున్నారు. రెండు లక్షల 24 వేల మందిని స్క్రీనింగ్ చేస్తే దాదాపు 50 వేల బిపి, షుగర్ కేసులు బయటపడుతున్నాయి. పసిపిల్లలు సైతం అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. 40 ఏళ్లు దాటిన వారు ప్రతి రోజూ టాబ్లెట్లు మింగకపోతే ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. మందులు కొనుగోలు చేసే మెడికల్ స్టోర్స్‌లో సరైన నిబంధనలు పాటించకపోయినా అడిగే నాథుడే లేకుండా పోయాడు. పట్టణాలు, పల్లెలు అనితేడా లేకుండా అత్యధిక మెడికల్ స్టోర్లలో కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా అడిగితే చిన్న కాగితపు ముక్కపై కేవలం ఎంతయ్యిందో రాసి మాత్రం ఇస్తున్నారు. గట్టిగా మాట్లాడితే బిల్లు ఇస్తే ఎక్కువ ఖర్చు అవుతుందని చెబుతున్న మెడికల్ స్టోర్‌ల యాజమానులు ఉన్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో డ్రంగ్ కంట్రోల్ కార్యాలయం ఉంది. ఏలూరు పట్టణంలో అతిపెద్ద మెడికల్ షాపుల్లో కూడా ఎక్కడా కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపన పోవడం లేదు. చాలా దుకాణాల్లో ఫార్మాసిస్టులు లేకుండా నడుస్తున్నాయంటూ చర్చ కొనసాగుతోంది.

డాక్టర్ చీటీ లేకుండానే మందుల విక్రయాలు..

నిబంధనల ప్రకారం డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదు. చాలా మెడికల్ స్టోర్స్‌లో డాక్టర్ చీటీతో సంబంధం లేకుండా మందుల విక్రయం ఎక్కువగా సాగుతోంది. జ్వరాలకు, కీళ్ల నొప్పుల సంబంధించిన మందులు, యాంటీ బయోటిక్స్ సైతం డాక్టర్ చీటీలేకుండా ఇచ్చేస్తున్నారు. రూపాయి ఖరీదు చేసే మందు బిళ్లకు రూ. ఐదు అంతకంటే ఎక్కువగానే వసూలు చేస్తున్నారు. పది టాబెట్ల మందుల షీట్ మొత్తం తీసుకుంటే ధర కొంతమేర తెలిసే అవకాశం ఉంటుంది. రెండు, మూడు టాబెట్లు ఇచ్చినప్పుడు ధర గురించే తెలిసే అవకాశమే లేకుండా పోతుంది. దీంతో మెడికల్ స్టోర్స్‌లో దోపిడీకి అంతులేకుండా పోతోంది. చాలా ఆసుపత్రుల్లో అనుబంధంగా మెడికల్ స్టోర్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆ డాక్టర్ రాసిన మందులు అక్కడే కొనుగోలు చేయాలి. ఎక్కడా కొనుగోలు చేయకూడదు. వారు ఎంత ధర నిర్ణయిస్తే ఆ ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీనిపై మాట్లాడిన వారే లేకుండా పోయారు. ఆసుపత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న మందుల దుకాణాలకు అసలు అనుమతులు ఉంటున్నాయో లేవో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. చాలా దుకాణాలు వేరే ఫార్మాసిస్టుల సర్టిఫికెట్లతో నడిచిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు ఫార్మా కంపెనీలతో కుమ్మక్కై నాణ్యతలేని మందులు సైతం విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు చేస్తున్నారా, చేస్తే ఎటువంటి కేసులు నమోదు చేశారు, చర్యలు ఏమైనా తీసుకున్నారా అనేది ఏఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది. డ్రగ్స్ అధికారులు సైతం పజలకు అవగాహన కల్పించే విధంగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు సైతం డ్రగ్స్ కంట్రోల్ శాఖకు సంబంధించి సమీక్షా సమావేశాలు జరిపిన దాఖలాలు కనిపించడం లేదు. సిబ్బంది తక్కువగా ఉన్నారన్న నెపంతో పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. మనుషుల ప్రాణాలకు సంబంధించి మందులు విక్రయించే మెడికల్ షాపులపై నిఘా పెంచాలని, నిరంతరం దాడులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

మంత్రి లోకేష్ పర్యటనలో పొరపాట్లు లేకుండా చూడాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమ్యూనికేషన్, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ పర్యటనలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం జెసి రాహుల్ కుమార్‌రెడ్డి ఉండి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్న తరగతి గదులు, క్రీడా సౌకర్యాల కోసం ఏర్పాటు చేసిన కోర్టులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఉండి జెడ్‌పి హైస్కూల్‌కు రానున్న సందర్భంగా కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హై స్కూల్ ఆవరణలో మంత్రి పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అన్ని ఏర్పాట్లూ ముందుగానే చూసుకోవాలని ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మికి, ఇఒపిఆర్‌డికి పలు సూచనలు జారీచేశారు. మంత్రి పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంత్రి పర్యటించే రోడ్లు ఇరుపక్కల చెత్తా, చెదారం లేకుండా శానిటేషన్ చేసి బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ సెక్రటరీని జెసి ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్ఎస్ఎస్‌బిఎల్.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ, తహశీల్దార్ కె.నాగార్జున, హెచ్ఎం రామలక్ష్మి, ఇఒపిఆర్‌డి, పంచాయతీ సెక్రటరీ ఉన్నారు.

శ్మశానవాటిక సమస్యను పరిష్కరించరూ!

జల వనరుల శాఖా మంత్రి నిమ్మలకు చించినాడ దళితుల వేడుకోలు

ప్రజాశక్తి - యలమంచిలి

దళితుల శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకు మొరపెట్టుకున్నారు. వివరాల్లోకెళితే.. మండలంలోని చించినాడ గ్రామంలో 100 సంవత్సరాలకు పైబడి సుమారు 500 మంది ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన దళితులు శ్మశానంగా ఉపయోగించుకుంటున్న ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని గత కొన్ని సంవత్సరాల కిందట గ్రామంలోని సరిహద్దుదారుడైన ఒక భూస్వామి ఆ భూమిని కబ్జా చేసి, దొంగ పాసు పుస్తకం సృష్టించి, కోర్టు ద్వారా ఆ భూమిని స్వాధీనం చేసుకొన్నాడు. దీంతో గ్రామంలోని ఆర్లపాడు, విప్పర్తిపేట, అరుంధతి పేటలలో ఎవరు మృతి చెందినా... గోదావరి ఏటిగట్టు పంచన పూడ్చి పెట్టుకొనే దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితి నుంచి తమకు విముక్తి కల్పించి శ్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఆదివారం చించినాడ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి విచ్చేసిన రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముమ్మిడివరపు ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, విప్పర్తి అవినాష్‌లు మంత్రితో మాట్లాడుతూ భూస్వామి కబంధహస్తాల్లో ఉన్న శ్మశాన స్థలం సుమారు 70 సెంట్లు ఇప్పటికీ ప్రభుత్వ రికార్డులలో ప్రభుత్వ పోరంబోకుగానే రికార్డు అయి ఉందని, దీనిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, తమకు శ్మశాన స్థలంగా కేటాయించాలన్నారు. లేనిపక్షంలో దానికి కొంత సమీపంలోనే ఏటిగట్టుకు చేర్చి రెండు చోట్ల మరికొంత ప్రభుత్వ భూమి ఉందని, దానినైనా సర్వే చేయించి తమకు శ్మశాన స్థలంగా కేటాయించి, న్యాయం చేయాలని వేడుకున్నారు. అదేవిధంగా చించినాడ గ్రామపంచాయతీ వైసిపి పాలనలో సాగుతుందని, దళిత మహిళ సర్పంచిగా ఉన్నప్పటికీ అగ్రవర్ణాల చేతుల్లో పెత్తనం ఉండడం ద్వారా దళిత పేటలు వివక్షకు గురవుతూనే ఉన్నాయని, అరుంధతి పేట విప్పర్తిపేటలలో రహదారులను నిర్మించాలని ఎన్నిసార్లు వేడుకున్నా.. పట్టించుకోకుండా వారికి అనుకూలమైన అగ్రవర్ణ ప్రాంతాలలో రహదారులు నిర్మించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అన్ని విషయాలను పరిశీలించి, న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.


మంత్రికి వినతి అందజేస్తున్న దళిత నాయకులు

అంబేద్కర్ నేటి తరానికి ఆదర్శనీయం

విగ్రహావిష్కరణలో ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయం అని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఒకటవ వార్డులో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బాల్యం నుంచి వివక్షను ఎదుర్కొంటూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అస్ప్రృశ్యతను నివారించడం నుంచి మానవ సమాజాన్ని సమైక్యం చేయడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. న్యాయవాదిగా, ఆర్థికశాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహానాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఈ విగ్రహావిష్కరణకి ఇక్కడ ప్రజల్ని భయభ్రాంతులను చేసి, విగ్రహావిష్కరణ నోచుకోకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో అంత వివక్షత ఉండదని, మహనీయుల విగ్రహాలు పెట్టుకునే విధంగా అన్ని విధాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల నారాయణమూర్తి, వర్తనపల్లి కాశి, చాపల రమేష్, పాలూరి వెంకటేశ్వరరావు, కాళ్ల గోపి, పైబోయిన వెంకటరామయ్య, యంట్ర పాటిరాజు, గుండుమోగుల సురేష్, పద్మప్రియ, సింగం సుబ్బారావు, సిఐఎం చర్చి యూత్, జై భీమ్ యూత్, మహిళలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎంఎల్ఎ, నేతలు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం : మంత్రి

పాలకొల్లు : పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.6 లక్షల 25 వేల విలువ గల హై స్పీడ్ కమర్షియల్ కుట్టు మిషన్లు 25 మంది మహిళలకు ఉచితంగా అందించారు. స్వయంగా మంత్రి నిమ్మల రామానాయుడు, హై స్పీడ్ మిషన్ ద్వారా బట్టలను కుట్టి మహిళను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో మన ఎపిలోనే డ్వాక్రా సంఘాలు నెలకొల్పి, మహిళలకు పెద్దపీట వేసింది సిఎం చంద్రబాబు అన్నారు. మహిళా సాధికారిత ద్వారా మహిళలకు ఆర్థిక పరిపుష్టి కల్పించి ప్రతి మహిళ తన కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకుని, సమాజంలో గౌరవంగా జీవించేలా చేసామన్నారు. గతంలో ఇంటికి ఒక మనిషి కష్టపడితే ఇల్లు గడిచేదని, ఈ రోజుల్లో ఇంట్లో ప్రతి ఒక్కరూ కష్టపడితేనే కాని ఇల్లు గడవని పరిస్థితి ఉందన్నారు. హై స్పీడ్ కమర్షియల్ కుట్టుమిషనుకు 14 రోజులు మహిళలకు శిక్షణ ఇచ్చుట అభినందనీయం అన్నారు. రోజువారి ఆదాయంతో పాటు హై స్పీడ్ కుట్టు మిషన్ వల్ల మరింత లాభం పొందవచ్చునని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులను మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు చవ్వాకుల సూర్య నరేష్ బాబు, పవన్, రావూరి సుబ్బారావు పాల్గొన్నారు.


కొవ్వలి రామ్మోహన్ నాయుడును సన్మానిస్తున్న కొత్తపల్లి సుబ్బారాయుడు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం కొండవీటివారి తోటలో ఆదివారం కాపు, తెలగ కుటుంబ సభ్యులు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. దాదాపు 30 వేల మంది ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా, ఉల్లాసంగా కుటుంబ సభ్యులతో గడిపారు. ముందస్తు సంక్రాంతి వాతావరణం ఉట్టిపడేలా ముత్యాల ముగ్గులు, గంగిరెద్దులు, బసవన్నలు, ఎడ్లబండ్లు, హరిదాసులు, కీర్తనలతో సందడిగా కనిపించింది. మహిళలు, చిన్నారులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్, డాన్సులు వంటి పోటీలు పెట్టి విజేతలకు బహుమతులందించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు, మాజీ ఎంపిపి కొత్తపల్లి జానకీ రాంనాయుడు, కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి సురేష్, తమ్మిశెట్టి బాబ్జీ, గుగ్గిలపు మురళీ, వన్నెంరెడ్డి శ్రీను, రాజ్యలక్ష్మి, చెన్నా రమేష్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, బ్రహ్మానందం, అయ్యప్పనాయుడు, పులఖండం వీర రాఘవులు, కావలి నాని పాల్గొన్నారు.

బధిర పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం శ్రీవెంకటేశ్వర బధిర పాఠశాలలో సాంప్రదాయబద్ధంగా శ్రీవిజ్ఞానవేదిక కళాశాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు, వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఆదివారం అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, న్యాయవాది ఉండవల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ ఇటువంటి బధిర విద్యార్థులకు అన్ని పండగల విశిష్టతను తెలియజేయడం గొప్ప విశేషమని, మన సంస్కృతి సాంప్రదాయాల గురించి వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 38 మంది విద్యార్థులకు షటిల్, వాలీబాల్, కో కో, స్కిప్పింగ్, రింగ్, క్రికెట్, రంగవల్లుల పోటీలను నిర్వహించామని, విజేతలకు ఈనెల 12న జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మనాభ రాజు, పిఇటి లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో డిజిపి తిరుమలరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణంలో వేంచేసియున్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ డిజిపి ద్వారకా తిరుమలరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, శేషవస్త్రం, శ్రీఅమ్మవారి ఫొటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్‌పి భీమారావు, జనసేన ప్రోటోకాల్ చైర్మన్ తిరుమలరావు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని శ్రీనివాస హాస్పిటల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించనున్నామని ఆసుపత్రి వైద్యులు చెరుకూరి శ్రీనివాసరాజు తెలిపారు. పాలకొల్లులోని రాజవల్లి రాధా రమణి లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో కంటి వైద్యం, కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తారన్నారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అతి తక్కువ ధరలకు అందిస్తామన్నారు. కంటి శుక్లం(కేటరాక్ట్) ఆపరేషన్లు అవసరమైన పేదవారికి ఉచితంగాను కంటి ఆపరేషన్లు చేయబడునని ఆయన తెలిపారు. ఈ ఉచిత నేత్రాలజీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు శ్రీనివాసరాజు కోరారు.

ప్రతిఒక్కరూ గుండె పరీక్షలు చేయించుకోవాలి

టిడిపి మండల అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏ వయసు వారికైనా ప్రస్తుత కాలంలో గుండె వైద్య పరీక్షలు తప్పనిసరి అని తాడేపల్లిగూడెం మండల టిడిపి అధ్యక్షుడు పరిమి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని చిన్న తాడేపల్లిలో ఆదివారం ఉష కార్డియాక్స్ సెంటర్ వైద్యులు డాక్టర్ వైవి రావు పర్యవేక్షణలో ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలో 70 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించగా 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చితకన శ్రీనివాస్, నాయకులు పరిమి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి కోనపాముల వెంకట్రావు, నాయకులు గన్నమని రాజేష్, నందమూరి ప్రకాశం పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు పాపారావు

100 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని సంకా వారి కాంప్లెక్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి క్లినిక్‌కి చెందిన గుండె ఊపిరితిత్తుల వైద్య నిపుణులు సంకా విఎస్.పాపారావు సుమారు 100 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో ప్రజలకు బిపి, షుగర్, నరాల సంబంధిత తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సంకా ముత్యం రామ నాగేశ్వరరావు, సేవలందించారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

భీమవరం టౌన్ : ఈనెల రెండో తేదీన ఒకటో పట్టణం వివేకానంద బొమ్మ సెంటర్ ఏరియాకి చెందిన 12 ఏళ్ల బాలిక రాత్రి 7 గంటలకు ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్లిపోవటంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు ఇక్క వద్ద స్నేహితుల ద్వారా బాలిక కోసం గాలించారు. తల్లిదండ్రులు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడో తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంటల వ్యవధిలో 12 ఏళ్ల మైనర్ బాలిక మిస్సింగ్ కేసును ఛేదించినట్లు ఎస్‌పి కార్యాలయం తెలియజేసింది. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ బి.వై.కిరణ్ కుమార్, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సదరు బాలిక మొబైల్ లొకేషన్, ప్రత్యేక ఇంటెలిజెన్స్ సమాచారం సహాయంతో పాలకొల్లు మండలం గరగపర్రు సమీపంలోని కృష్ణ వాటికలో గుర్తించారు. అనంతరం సదరు బాలికను తల్లిదండ్రుల సమక్షంలో విచారించగా, సదరు అమ్మాయి తన ఇంట్లో వారు తనను పట్టించుకోవట్లేదని, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన మరొక కుర్రాడు మాటలు నమ్మి అతనితో పాటు ఈనెల 2న రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిపింది. ఊహలోకంలోకి వెళ్లి ప్రేమ పేరుతో మోసపోవద్దని, తల్లిదండ్రులు పిల్లలను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకోవాలని, ఫోన్లో వారు ఏం చేస్తున్నారు, ఎప్పటికప్పుడు నిఘా పెట్టుకుని వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. మిస్సింగ్ కేసును త్వరితగతిన ఛేదించిన భీమవరం వన్ టౌన్ ఎస్ఐ బి.వై.కిరణ్ కుమార్, జిల్లా ఐటీ కోర్ కానిస్టేబుల్ ఎన్.భాస్కర్, కానిస్టేబుల్ లెనిన్ ప్రసాద్‌ను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పర్యావరణానికి తూట్లు..!

యథేచ్ఛగా నరికేస్తున్న చెట్లు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

పర్యావరణ సమతుల్యతకు మొక్కలే కీలకం. మంచి గాలి, వాతావరణాన్ని ప్రసాదించే మొక్కలను విద్యుత్ తీగలకు అడ్డంగా వస్తున్నాయని, కొత్త విద్యుత్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ సిబ్బంది యథేచ్ఛగా నరికేస్తున్నారు. ఇప్పటికే జల, గాలి, వాయు, శబ్ద కాలుష్యంతో వాతావరణం కలుషితమైంది. అయితే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా ఎదిగిన పచ్చని మొక్కలను తొలగిస్తున్నారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడంతో అడ్డూ అదుపూ లేకుండా చెట్లను నరికేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో మొక్కల పాత్ర ఎంతో కీలకం. చెట్లు తగ్గిపోవడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవించి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతాయి. అందుకు ఉదాహరణ ఇటీవల కాసిన ఎండలే నిదర్శనం. మానవుడు తన స్వార్థానికి మొక్కలను, చెట్లను నరికేస్తున్నాడు.

జక్కరంలో నరికేసిన చెట్లు

మండలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో మొక్కలను నాటారు. ఏలూరుపాడు నుంచి పెదఅమిరం వరకూ ప్రధాన రహదారికి ఇరువైపులా పచ్చని మొక్కలు దర్శనమిస్తుంటాయి. ఏపుగా పెరిగిన మొక్కలను సైతం నరికేస్తున్నారు. కరెంటు తీగలకు తగులుతాయనే కారణాన్ని చూపి ఇష్టానుసారంగా మొక్కలను విద్యుత్ అధికారులు నరికేస్తున్నారు. ఎదిగిన మొక్కలను ఇలా నరికివేయడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని, మొక్కలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రేమ పేరుతో యువకుడి మోసం

ఫ్యాన్‌కు ఉరేసుకుని యువతి మృతి
తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

ప్రేమ పేరుతో తమ కుమార్తెను మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వీరికి సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. వివరాల్లోకెళితే.. ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని యువతి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. లక్ష్మణేశ్వరం ప్రగతి నగర్‌కు చెందిన టంకాని లక్ష్మీకుమారి(19) తన గదిలో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఉండటాన్ని చూసి ఆమె సోదరి గమనించి కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై నరసాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు

ఎంఎల్ఎ నాయకర్‌తో చర్చిస్తున్న కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు

ఆదివారం నరసాపురం ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వీరికి ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆందోళనకు మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. పోడూరు ఎస్ఐ కె.సుధాకర్ రెడ్డి, నరసాపురం పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకటసురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎంతకీ కుటుంబ సభ్యులు ఆందోళన విరమించుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, సిపిఎం నాయకులు 216 జాతీయ రహదారిపై రుస్తుంబాద వద్ద రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి జాతీయ రహదారిపై చేరుకున్నారు. నిందితులను అరెస్టు చేయాలని, కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అప్పటివరకు ఆందోళన విరమించలేదని రోడ్డుపై బైఠాయించారు. ఆత్మహత్య కారకులైన నిందితులను అరెస్ట్ చేస్తామని, కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

విజయం సాధించిన క్రీడాకారులు

జెడ్‌పి పాఠశాలలో క్రాస్ కంట్రీ రోడ్డు రన్ ఛాంపియన్ షిప్ పోటీలు

తణుకు : 59వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ రోడ్డు రన్ ఛాంపియన్ షిప్ 2025ను ఆదివారం తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్ వద్ద నిర్వహించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలియజేశారు. బాలుర పోటీలను ఆరిమిల్లి తాతారావు, బాలికల పోటీలను గ్రామ సర్పంచి విశ్వనాధం కృష్ణవేణి ప్రారంభించారు. ఈ పోటీలు అండర్ 16, 18, 20 బాలుర, బాలికల, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 12వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి అందజేశారు. పలు జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు హజరు కాగా, బహుమతులు ఆరిమిల్లి తాతారావు, భోజనాలు రెడ్డి నరేంద్ర, బండా వెంకటకృష్ణారావు, బండా వీర వెంకట నరేంద్ర, బండా వెంకటకృష్ణారావు, సత్యకృష్ణ గోవింద్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో పెనుమర్తి వెంకటలక్ష్మి, రెడ్డి నరేంద్రప్రసాద్, కరుటూరి నరేంద్ర, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్ పి.శిరీషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మునీంద్రరావు, వ్యాయమ ఉపాధ్యాయులు బి.జాన్సన్, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికి వైద్యంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డా.అహ్మద్‌హుస్సేన్, డాక్టర్ సుంకవల్లి నీలూమహేంద్ర, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్యలు తణుకు, పరిసర ప్రాంతాలు, ఉండ్రాజవరం గ్రామాల్లో పర్యటించి ఆరుగురు వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. సంఘ సభ్యులు అడ్డగర్ల వెంకటేశ్వరరావు, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా రూ.40 వేల ఆర్థిక సహకారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతిభావంతులను సమాజం గుర్తించాలని, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని ఎంఎల్ఎ అంజిబాబు నివాసంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థికి రూ.40 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ మన నియోజకవర్గంలో పేద విద్యార్థులకు సంపూర్ణ సహకారం అందించడానికి సన్నాహాలు చేశామని, దాతలు ఎంతోమంది ముందుకు వస్తున్నారని, ఈ విద్యార్థికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ మాట్లాడుతూ ఎందరో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు వెళ్లలేకపోతున్నారని, అటువంటి విద్యార్థులకు దాతలు ఆర్థిక సహకారం అందించడం


విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్న ఎంఎల్ఎ

గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రాజమండ్రిలోని సాయి నర్సింగ్ హోం కళాశాలలో పొన్నాడ ఉమామహేశ్వరి మొదటి సంవత్సరం నర్సింగ్ కోర్సులో సీటు సాధించారని, హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.లక్ష అవసరం కాగా, దాతలను సమీకరించి రూ.40 వేలను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి అడారి గణేష్, భీమవరం ఎస్‌టిఒ అల్లూరి రవివర్మ, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

వాసవీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వాసవీ క్లబ్ సమాజానికి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాసరావు గుప్తా అన్నారు. ఆదివారం వాసవీ క్లబ్ భీమవరం 2025 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని భీమవరం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. వాసవీక్లబ్ అధ్యక్షులుగా తాళ్లూరి వెంకట త్రివిక్రమరావు, కార్యదర్శి నేరెళ్ల వెంకట కోటేశ్వరరావు, కోశాధికారి చక్కా వెంకట కేశవరావు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాసరావు గుప్తా మాట్లాడుతూ సృజనాత్మకత, సానుకూలతలను ఉపయోగించుకున్న వారు ఉన్నత స్థానానికి చేరతారని, వాసవీక్లబ్ నేడు వేలాది మందికి అండగా నిలుస్తుందన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు త్రివిక్రమరావు, కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, రానున్న రోజుల్లో క్లబ్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ సిహెచ్ ఎన్‌వి.ప్రసాద్, జిల్లా కేబినెట్ సెక్రటరీ అనంతపల్లి చలపతి రావు, చల్లగండ్ల వెంకటేశ్వరరావు, కేదారశెట్టి రవికుమార్, కనగర్ల విజయ రామకృష్ణ, కెబి పాపారావు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంక్షేమానికి ఎనలేని కృషి

ఏలూరుపాడులో ఆర్య వైశ్య కళ్యాణ మండపం

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామానికి చెందిన కనగర్ల గాంధీ సమాజ అభ్యున్నతికి, ఆర్యవైశ్య సంక్షేమానికి ఎనలేని కృషి చేశారు. జువ్వలపాలెం గ్రామంలో ఈనెల 8వ తేదీన బుధవారం కనగర్ల గాంధీ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆయన వ్యాపారిగా రాణిస్తూ తన సంపాదనలో కొంత భాగం ధర్మ కార్యకలాపాలకు ఉపయోగించేవారు. మంచి వ్యక్తిత్వం, నడవడిక, పట్టుదల కలిగిన నాయకుడుగా, ఆర్య వైశ్య సంఘం, కార్యవర్గ సభ్యులందరినీ కలుపుకొని పోతూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన గత 20 ఏళ్లుగా కాళ్ల మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా, ఏలూరుపాడు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడుగా, ఏలూరుపాడు లయన్స్ క్లబ్, వాసవీక్లబ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఏలూరుపాడు గ్రామంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆర్య వైశ్య కళ్యాణ మండపం నిర్మాణం చేయాలని అక్కడ ఉన్న ఆర్య వైశ్య పెద్దలు అనుకుని, ఓ కమిటీగా ఏర్పడి 20 సెంట్ల స్థలాన్ని విరాళంగా 1995లో సేకరించారు. 1999లో ఆర్యవైశ్య కళ్యాణ మండపం నిర్మించారు. 2000లో కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. 2014 నుంచి 2024 ఏలూరుపాడు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా పనిచేశారు. పాలకవర్గ సభ్యుల ఆశయం, పని చేయాలి అనే దృక్పథం కలిపి తక్కువ సమయంలో బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతు ఆర్థిక సాయం అందించారు. ఆర్య వైశ్య శ్మశాన వాటిక అభివృద్ధికి, గాంధీ బజార్ రోడ్డు ఏర్పాటులో ఆయన పాత్ర విశేషంగా ఉంది. ఆయన కృషి చేసి సంఘాన్ని, కళ్యాణ మండపాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నారు.


కనగర్ల గాంధీ(ఫైల్)

సంక్రాంతిలోపు గుంతలులేని ఆంధ్రప్రదేశ్ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - యలమంచిలి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం యలమంచిలి మండలంలోని వివిధ గ్రామాలలో రూ.కోటి 75 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి, పోలవరం నిర్మాణం, పరిశ్రమల స్థాపన, పారిశ్రామికవేత్తలను స్వాగతించుటతో పాటు గ్రామ అభివృద్ధికి ఎన్‌డియే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తలపెట్టిన పల్లెపండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్రమంతా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. సంక్రాంతి లోపుగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసి, గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను ప్రజలకు చూపించి, జాతికి అంకితం చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో రూ.14 లక్షల కోట్లు అప్పు తెచ్చి ప్రతి వ్యక్తి మీద రూ.2.40 లక్షలు అప్పు పెట్టారన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం ద్వారా తెలుగు జాతికి, భావితరాలు వారికి మంచి భవిషత్ అందిస్తామని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛను ఒకేసారి పెంచి, మూడు నెలలు ఏరియర్సు కలిపి రూ.7 వేలు అందజేసామని తెలిపారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయిలు పెంచడానికి అయిదేళ్లు సమయం పట్టిందని, ఎన్‌డియే విడతల వారీగా కాకుండా ఒకేసారి పెంచి ఒకటవ తారీఖున ప్రతి ఇంటికి అందజేస్తున్నామన్నారు. ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సి, మెగా డిఎస్‌సి లేదని, ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేకపోయారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే డిఎస్‌సి 16,500 పోస్టులకు ఆమోదం తెలిపారని, వచ్చే విద్యా సంవత్సరంలోపు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, నిరుపేదకు కేవలం రూ.15కు మూడు పూటలా కడుపు నిండా భోజనం పెడుతున్నామని అన్నారు. దీపం పథకం-2 ద్వారా రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు గ్యాసు బండలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు.

యలమంచిలి మండలం బాడవ, ఏనుగువాని లంక, కలగంపూడి, చించినాడ, కాజ తూర్పు, కాజ పడమర, కొంతేరు గ్రామాల్లో రూ.కోటి 75 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు, శిలాఫలకాలాలను మంత్రి ఆవిష్కరించారు. ఏడు గ్రామాల కార్యక్రమాలకు మంత్రి రామానాయుడు స్వయంగా మెటారు సైకిల్ నడుపుతూ ప్రజలను పలకరించి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అడుగడుగునా ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మంగళహారతులను ఇచ్చి మంత్రి రామానాయుడునుదుటన మహిళలు కుంకుమ తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రంథి నాగవెంకట పవన్ కుమార్, ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, పంచాయతీ రాజ్ డిఇ కె.దుర్గా స్వామి నాయుడు పాల్గొన్నారు.

'నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం'

ఉండి : నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధి తమ లక్ష్యమని ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కోలమూరు గ్రామంలో సుమారు రూ.80 లక్షల నిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కోలమూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన మైక్రో ఫిల్టర్ బెడ్, దళితవాడలో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులను, కోలమూరు గ్రామానికి స్వచ్ఛమైన నీరందించేందుకు బిజెపి నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ నేతృత్వంలో కాలవ తవ్వకం పనులు నెల రోజుల్లోపు పూర్తి చేయనున్నామన్నారు. మూడు దశాబ్దాల తర్వాత గ్రామానికి స్వచ్ఛమైన మంచినీరు అందించటం శుభ పరిణామం అని తెలిపారు. గ్రామంలో ఇరుకుగా ఉన్న వీధుల్లో ఆక్రమణలు తొలగించాలని, కాలువ వెంబడి మట్టిపూడికతీత పనులు చేయాలని కోరారు. గ్రామ ఉపసర్పంచి నడింపల్లి రామకృష్ణంరాజు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పేరిచర్ల బాలరాజు, నాయకులు బాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

7న పాలమూరుకు జలశక్తి టీం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జలశక్తి అభియాన్‌కు సంబంధించి కేంద్ర బృందం పశ్చిమగోదావరి జిల్లాలో వివిధ గ్రామాలలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు పర్యటించి ఉపాధి హామీ పనులు, జల జీవన్ మిషన్ పనులు పరిశీలిస్తారని స్థానిక మండల పరిషత్ ఎంపిడిఒ బివిఎస్‌వి.శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా హార్టికల్చరల్ ప్లాంటేషన్‌లో భాగంగా మునగ తోట పనిని ఈనెల 7వ తేదీ ఉదయం 9.45 నిమిషాలకు పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు మైలా వసంతరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన అద్దేపల్లి జయంతోత్సవాలు

పాలకొల్లు : అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి సేవలు అపూర్వమని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అద్దేపల్లి 125వ జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అద్దేపల్లి వారి సత్రం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో 1942లో క్విట్ ఇండియా సమయంలో ఆయన మంత్రులు చైర్మన్‌గా క్విట్ ఇండియా తీర్మానం చేయడంతో బ్రిటిష్ ప్రభుత్వ మున్సిపల్ కౌన్సిల్లో రద్దు చేసిందని గుర్తు చేశారు. 1968వ ఆయన వద్ద సొమ్ము లేకపోయినా ఒక రైస్ మిల్లు అమ్మి వచ్చిన లక్ష రూపాయలతో పాలకొల్లులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నెలకొల్పారని, ఇప్పుడు ఆ రైస్ మిల్లు వందల కోట్ల విలువ చేస్తుందని చెప్పారు. పాలకొల్లు కళాశాలలో గత 53 సంవత్సరాల్లో వేలాదిమంది డిగ్రీ పాసై విదేశాల్లో సైతం స్థిరపడ్డారంటే అద్దేపల్లి విద్యాదానమే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

టిడిపి మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాలరావు మృతి

కాళ్ల : టిడిపి సీనియర్ నాయకుడు, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచి బండారు వేణుగోపాలరావు(71) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. మండల కేంద్రమైన కాళ్ల గ్రామానికి సర్పంచిగా రెండున్నర దశాబ్ధాల పాటు గ్రామస్థులకు విశేష సేవలందించారు. ఆయన భార్య బండారు సత్యవతి గ్రామ సర్పంచిగా ఐదేళ్ల పాటు పనిచేశారు. వేణుగోపాలరావు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఉండి మాజీ ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు ఆయన పార్థివ దేహానికి టిడిపి జెండా కప్పి నివాళులర్పించారు. ఆకివీడు, ఉండి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, గోకరాజు వెంకటశివరామరాజు, తోట ఫణిబాబు, గ్రామ సర్పంచిలు గేదల జాన్, బందా విజయప్రసంగి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలం, అత్తిలి చెందిన కానుమిల్లి చినరుద్ర మంగారావు, S/o.విద్యాధరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు నెం.L8488745 గల పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం అత్తిలి గ్రామంలో జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుతుండగా నాయొక్క పాస్‌పోర్టు మార్గమధ్యలో పడిపోయింది. చుట్టు ప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

అడ్రస్ : కానుమిల్లి చినరుద్ర మంగారావు
S/o.కానుమిల్లి విద్యాధరరావు,
డోరునెం.2-101, రామన్నపేట, అత్తిలి,
అత్తిలి మండలం - 534134, ప.గో.జిల్లా.
సెల్: 9866286679